క్లుప్తంగా

నృత్య గురువు కరీముల్లాకు సన్మానం



డ్యాన్స్ మాస్టర్ కరీముల్లాను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ నాట్యాచార్యులు కరీముల్లాను ఘనంగా సన్మానించారు. అనంతపురం టీటీడీ కళ్యాణ మండపంలో జరిగిన లహరి డ్యాన్స్ ఫిట్‌నెస్ అకాడమీ రజతోత్సవ వేడుకల్లో రాయలసీమలోని ప్రముఖులైన 25 మంది నాట్య గురువులను ఘనంగా సన్మానించారు. అందులో భాగంగా గత 22 సంవత్సరాలుగా కూచిపూడి నృత్యంలో శిక్షణ ఇస్తూ అనేక మందిని కళాకారులుగా తీర్చిదిద్దిన కరీముల్లాను లహరి డ్యాన్స్ ఫిట్‌నెస్ అధినేత హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బోయ గిరజమ్మ, సీనియర్ సినీ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ స్వర్ణ తదితరులు సన్మానించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శిస్తున్న చిన్నారులు

కర్నూలు కల్చరల్: రిపబ్లిక్ డేను పురస్కరించుకొని కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్క్‌లో శనివారం నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. దేశభక్తి గీతాలు, భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్యం, ఏకపాత్రాభినయం తదితర అంశాల్లో విద్యార్థులు, కళాకారుల ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాకారులు పాల్గొన్నారు.

గైర్హాజరైన అభ్యర్థులకు 27న దేహదారుఢ్య పరీక్షలు

కర్నూలు (టౌన్) : పోలీసు కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలకు గైర్హాజరైన అభ్యర్థులకు ఈ నెల 27న మరో అవకాశం ఇస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం తెలిపారు. గత నెల 30వ తేదీన పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హత సర్టిఫికెట్లు, క్రిమిలేయర్, కుల ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్లు, ఇతర స్టేజ్-1, స్టేజ్-2 లో అప్‌లోడ్ చేసుకున్న సరైన ధ్రువ పత్రాలు, ఒరిజినల్స్, జిరాక్స్ వెంట తీసుకురావాలన్నారు. సరైన ధ్రువపత్రాలు లేకుంటే మళ్లీ వెనుక్కి పంపిస్తారని తెలిపారు. ఎత్తు, ఛాతీ కొలతలు తదితర అంశాల్లో అప్పీలు చేసుకున్న అభ్యర్థులకు తూనికలు, కొలతల అధికారులు, మెడికల్ ఆఫీసర్ల సమక్షంలో ఈనెల 28న ముగింపు రోజున పరీక్షలకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

గణతంత్ర వేడుకలకు ఘనమైన ఏర్పాట్లు

- ముస్తాబైన పరేడ్ మైదానం
- ఉదయం 9 గంటల నుంచి వేడుకలు ప్రారంభం
- జిల్లా ప్రగతిని చాటేలా శకటాలు, స్టాళ్ల ప్రదర్శన
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం



పరేడ్ మైదానంలో ముస్తాబైన వీవీపీల వేదికలు



కలెక్టరేట్ వద్ద బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

కర్నూలు (టౌన్) : గణతంత్ర వేడుకలకు పరేడ్ మైదానం ముస్తాబైంది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి వేడుకలు ఘనంగా ప్రారంభం అవుతాయి. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో జాతీయ జెండా అవిష్కరణ, గౌరవ వందనం స్వీకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మైదానాన్ని రంగురంగుల జెండాలతో అలంకరించారు. వేదికకు ఇరువైపులా వీవీపీలు కూర్చునేందుకు వేదికలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రముఖులు, విద్యార్థినీ, విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలిరానుండటంతో షామియానాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా ప్రగతిని చాటేలా శకటాల ప్రదర్శన, స్టాళ్లను ఏర్పాటు చేశారు. మైదానం మొత్తం మున్సిపల్ అధికారులు ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టారు. అలాగే కొండారెడ్డిబురుజును విద్యుత్ బల్బులతో అందంగా అలంకరించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఏడాది 450 మంది ఉత్తమ సేవలు అందించిన వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

విస్తృత తనిఖీలు...

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, వీవీపీలు కార్యక్రమానికి తరలిరావడంతో పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంది. అందులో భాగంగా నగరంలోని ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. అలాగే ప్రధాన రహదారులతో పాటు రైల్వే స్టేషన్, బస్టాండ్, కలెక్టరేట్, ఆర్‌ఎస్ రోడ్, సిటీ స్క్వేర్ మాల్, జ్యోతి మాల్ తదితర జనం రద్దీగా ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. అలాగే పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో రిహార్సల్స్ నిర్వహించారు.



పరేడ్ మైదానంలో ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

న్యాయ సంస్థల్లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని న్యాయ సంస్థల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. లోకాయుక్త, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ), జిల్లా కోర్టుల్లో గణతంత్ర వేడుకల సందర్భంగా జాతీయ పతాకాల ఆవిష్కరణ, స్వాతంత్ర్య సందేశాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మానవ హక్కుల కమిషన్ కార్యాలయంలో 9 గంటలకు, లోకాయుక్తలో 9 గంటలకు, జిల్లా కోర్టులో 8.30 గంటలకు జెండావిష్కరణలు జరగనున్నాయి.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ కనెక్షన్లకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని విద్యుత్ భవనంలో విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి చేతుల మీదుగా యునైటెడ్ ఎలక్ట్రిక్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్, డైరీని ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో యూఈఈయూ నాయకులు నాగరాజు, సీఐటీయూ నగర కార్యదర్శి మహమ్మద్‌రఫీ, నాయకులు మాబు, నాగేంద్రప్ప, కాలప్ప, దేవేంద్రప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

లలిత కళా సమితిలో అక్రమాలపై విచారణ చేయాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు కల్చరల్: పత్తి ఓబులయ్యను లలిత కళాసమితి అధ్యక్షుడి బాధ్యతల నుంచి తప్పించాలని, లలిత కళా సమితిలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేయించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సీక్యాంప్ లలిత కళా సమితి వద్ద శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ వంద సంవత్సరాల్లోకి అడుగు పెట్టిన సందర్భంగా శుక్రవారం లలితా కళా సమితిలో ఏపీ ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో కళాకారులను అభినందించే కార్యక్రమం నిర్వహించామన్నారు. ఒక డ్యాన్సర్ కళ్లు తిరిగి కింద పడిపోవడంతో ఆమెను ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ తరుణంలో పత్తి ఓబులయ్య అక్కడ ప్రోగ్రాం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులను నానా దుర్భాషలాడారన్నారు. ఎందుకలా మాట్లాడుతున్నావని ప్రశ్నించిన రామకృష్ణారెడ్డిని చెప్పుకోలేని విధంగా మాట్లాడి.. సీపీఐ నాయకులందరూ పనికిమాలిన వారని దూషించారని చెప్పారు. పత్తి ఓబులయ్య లలిత కళా సమితిపై వచ్చే ఆదాయంలో అవినీతికి పాల్పడుతూ రూ. కోట్లు ఆర్జించారని ఆరోపించారు. ఆదాయం చెప్పని ఆయనను పదవి నుంచి తొలగించి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం ప్రజా దర్బార్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓబులయ్యపై ఫిర్యాదు చేశారు. నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో నగర సహాయ కార్యదర్శులు చంద్రశేఖర్, శ్రీనివాసరావు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, నగర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను ఎదుర్కొనే సత్తా ఉన్న నాయకుడు జగనన్న



మాట్లాడుతున్న మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్) : ఎటువంటి సవాళ్లనైన ఎదుర్కొనే సత్తా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ వ్యవస్థాపక అధ్యక్షులు జగనన్నకే ఉందని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం సి.క్యాంపులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో అవసరం లేకున్నా 23 మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను చంద్రబాబు నాయుడు చేర్చుకున్నా జగన్ బెదరలేదన్నారు. జగనన్నను రాజకీయంగా దెబ్బతీయాలన్న కుట్రతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీలోని కొంతమంది నాయకులను ప్రలోభాలకు గురిచేయడం, ఒత్తిళ్లకు పాల్పడటం వల్లే పార్టీని వీడుతున్నారన్నారు. అలాంటి వారి వల్ల వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఏ మాత్రం నష్టం జరగదని స్పష్టం చేశారు. కోట్లాది ప్రజల ఆదరణ, ఆశీస్సులు ఆయనకు కొండంత అండగా ఉన్నాయన్నారు. ఎన్ని ఇబ్బందులు సృష్టించిన గత ఎన్నికల్లో 151 సీట్లతో ప్రభంజనం సృష్టించారని గుర్తు చేశారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. ప్రజా సమస్యలపై మరింత కసితో ప్రజల పక్షాన పోరాడతామన్నారు.

ఈరన్న హంతకులను కఠినంగా శిక్షించాలి

ఆలూరు నియోజకవర్గం ఆరికెర గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కురువ ఈరన్నను దారుణంగా చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. ఈరన్న కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందన్నారు.

హాస్టళ్లకు డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ, గరల్స్, బాయ్స్ హాస్టళ్లకు సరైన డ్రైనేజీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసిన తరువాతే సీసీ రోడ్లు వేయాలని కోరుతూ విద్యార్థులు శనివారం ఆందోళన చేపట్టారు. బి.క్యాంపులోని సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ నుంచి మిలిటరీ క్యాంటీన్‌కి వెళ్లే రోడ్డు దెబ్బతినడంతో సీసీ రోడ్డు వేస్తున్నారు. హాస్టల్స్‌కు డ్రైనేజీ కాలువలు వేయకుండా సీసీ రోడ్డు వేస్తే మరింత మురుగు నీరు హాస్టల్స్‌లో నిలిచిపోతుందని విద్యార్థులు రోడ్డుపైనే కూర్చొని ఆందోళన చేపట్టారు. ఆందోళనకు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మద్దతు తెలిపారు. నేజీ కాలువలు వేసిన తరువాతే సీసీ రోడ్డు వేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్, నగర ఉపాధ్యక్షుడు అబూబాకర్ డిమాండ్ చేశారు. ఆందోళనతో అక్కడి వచ్చిన క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు విద్యార్థుల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఆ తరువాత అక్కడకి వచ్చిన మున్సిపల్ ఇంజినీర్లకు డ్రైనేజీ కాలువల ఇబ్బందుల గురించి తెలియజేయగా.. కాలువలు వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. .

వీసీ పదవి కేటాయించాలి

కర్నూలు కల్చరల్ : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఎరుకల సామాజిక వర్గానికి వైస్ చాన్స్‌లర్ పదవి కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప డిమాండ్ చేశారు. శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నేటివరకు ఎరుకల సామాజికవర్గం వైస్ చాన్స్‌లర్ పోస్టుకు నోచుకోలేదన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఎరుకల సామాజిక వర్గం ప్రొఫెసర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అట్టడుగు వర్గమైన ఎరుకల సామాజిక వర్గాన్ని గుర్తించి తగు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరాజు, నాయకులు భాస్కర్, దత్తు, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదా నిబంధనలను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఫెడరల్ హక్కులను కాలరాసి ప్రభుత్వ యూనివర్సిటీలను మూసివేసే కుట్రలో భాగంగా యూజీసీ తీసుకొచ్చిన ముసాయిదా నిబంధనలను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి బందల నాసర్ జీ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాల హక్కులను కాలరాసేవిధంగా స్వయం ప్రతిపత్తిని అణచి వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సోమన్న, షాబీర్‌బాషా, శరత్‌కుమార్, రంగస్వామి, థామస్ పాల్గొన్నారు.

రాయలసీమ రత్నం టీకేఆర్ శర్మ

కర్నూలు (సిటీ) : స్వాతంత్ర సమరయోధులు, గాంధేయవాది రాయలసీమ గర్వించదగ్గ విశిష్ట దేశభక్తులు టీకేఆర్ శర్మ (తాళ్లపల్లి కరణం రామచంద్ర శర్మ) అని, వారి శతజయంతి ఉత్సవాన్ని జరుపుకోవడం సంతోషకరమని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీ సభ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 30వ తేదీన టీకేఆర్ శర్మ శత జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శర్మ నాయకత్వాన్ని, సమాజ ప్రేమను గుర్తు చేసుకుంటూ సదస్సు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. సాహితీ సదస్సు సహకారంతో శతజయంతి సభను క్లస్టర్ యూనివర్సిటీ కేవీఆర్ క్యాంపస్‌లో నిర్వహిస్తామన్నారు. గాడిచర్ల ఫౌండేషన్, సాహితీ సదస్సు అధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూర మాట్లాడుతూ ప్రముఖ సోషలిస్టుగా వందల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిపెట్టిన సహృదయులు టీకేఆర్ శర్మ అన్నారు. శత జయంతి సభను విజయవంతం చేయాలని కుమారుడు టీకే కృష్ణమూర్తి, అల్లుడు మురళి కుటుంబ సభ్యులు కోరారు. రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, జీఎస్‌ఆర్‌కే శర్మ, డాక్టర్ పార్వతి దేవి, డాక్టర్ ఫమీద, డాక్టర్ వింధ్యావాహిని పాల్గొన్నారు.

దంతాలు శుభ్రం చేసుకోవాలి

కర్నూలు (హాస్పిటల్) : బాల్య దశ నుంచే రోజుకు రెండుసార్లు దంతాలు శుభ్రం చేసుకోవాలని దంత వైద్యులు డాక్టర్ ఎం.డి.నౌషాద్ చెప్పారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ బ్రాంచ్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని శనివారం స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని మున్సిపల్ పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో దంత వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ జీబ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయ పరిధిలో డిగ్రీ 2015, 2016, 2017, 2018 సంవత్సరాల్లో డిగ్రీ కోర్సులో చేరి తమ కోర్సు పూర్తి చేసుకోలేని విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 6 నుంచి మార్చి 15వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అలాగే ఆర్‌యూ పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) 2015 నుంచి 19 సంవత్సరాల్లో చేరి తమ కోర్సు పూర్తి చేసుకోలేని విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

కర్నూలు (టౌన్) : నగరంలో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర పాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదేశించారు. శనివారం నగరంలోని చిదంబరవీధి, కృష్ణానగర్, కొత్తపేట, ఎస్‌ఆర్ పేట తదితర కాలనీలలో కమిషనర్ పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మెరుగైన పారిశుద్ధ్యం కోసం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే పలుచోట్ల మురుగు కాల్వలను నిర్మించాల్సి ఉందన్నారు. వాటిని గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అదేవిధంగా మరమ్మతులు చేపట్టాల్సిన వాటిని కూడా గుర్తించాలన్నారు.డీఈఈ మనోహర్ రెడ్డి, పారిశుద్ధ్య తనిఖీ అధికారి లోకేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులను గుర్తించాలి

కర్నూలు(హాస్పిటల్): క్యాన్సర్ బాధితులను ముందుగా గుర్తిస్తే చికిత్స అందించడం సులభం అవుతుందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ శైలేష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎన్‌టీఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో ఎన్‌సీడీ-సీడీ వ్యాధుల స్క్రీనింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులైన రొమ్ము, గర్భాశయ ముఖద్వార, నోటి క్యాన్సర్లపై సర్వే నిర్వహించి అనుమానితులను త్వరగా గుర్తించాలన్నారు. ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధాకర్, వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉప వర్గీకరణ దేశానికే ప్రమాదం



చింతామోహన్‌ను సన్మానిస్తున్న మాల జేఏసీ

కర్నూలు (అర్బన్) : షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ దేశానికే ప్రమాదమని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆయనను మాల సంఘాల జేఏసీ నేతలు కలసి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని వివిధ శాఖల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల పెండింగ్‌లో పడిపోయాయన్నారు. ప్రభుత్వాలు బ్యాక్ లాగ్ పోస్టుల పై దృష్టి సారించి వాటిని వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాసారపు వెంకటేష్, జేఏసీ నేతలు చెరుకూరి అశోకరత్నం, స్వామిదాసు గారి నాగేంద్ర, రాజ్‌కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌యూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, విద్యార్థులు

కర్నూలు కల్చరల్ : అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండటంతో పాటు దానిని సద్వినియోగం చేసుకోవాలని రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యూనివర్సిటీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఏర్పాటై నేటికి 75 సంవత్సరాలు పూర్తయ్యిందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి పౌరుడు ఎన్నికల్లో ఓటు వేసినప్పుడే సమర్థవంతమైన నాయకత్వం దేశానికి లభిస్తుందన్నారు. అనంతరం వర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, ఆచార్య ఎం.నరసింహులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కర్నూలు సిటీ: నిర్ణీత వయస్సు 18 సంవత్సరాలు నిండిన వారందరూ తప్పక ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఓటు అనేది యువత చేతిలో ఆయుధమని ఏపీఎస్‌పీ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నా రు. శనివారం స్థానిక మైపర్ కాలేజీలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకోని ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగించారు. భవిష్యత్తును నిర్ణయించేది ఓటు మాత్రమేనన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.కె మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డా.సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, తదితరులు

విద్యార్థుల ర్యాలీ

ప్రభుత్వ వొకేషనల్ కాలేజీకి చెందిన విద్యార్థులు ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఏపీపీఎస్ డీఎస్పీ మహబూబ్ బాషా, ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి



ఈరన్నకు నివాళులర్పిస్తున్న డ్వామా జేఏసీ

కర్నూలు(సెంట్రల్): ఆలూరు మండలం ఆరికెర ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డ్వామా జేఏసీ డిమాండ్ చేసింది. శనివారం రాత్రి కలెక్టరేట్ వద్ద గాంధీ విగ్రహం ఎదుట ఈరన్న ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తులు వెలగించి నివాళులర్పించారు. డ్వామా ఉద్యోగుల జేఏసీ చైర్మన్, ఏపీడీ లక్ష్మన్న మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ఎప్పుడూ చంపడం లాంటివి చేయలేదని, ప్రభుత్వాలు మారిన సమయంలో కొందరిని మార్చుకోవడం సర్వ సాధారణమన్నారు. అలాంటిది ఈరన్న హత్య చేయడం దారుణమన్నారు. ఈరన్న కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్వామా జేఏసీకి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కేవీ నారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ మధుబాబు, ఈసీ సంఘం నాయకుడు మనోహర్ పాల్గొన్నారు. అదేవిధంగా సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట అరికెర ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న మృతికి నిరసనగా ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు బొజ్జప్ప, దేవేంద్ర, వీరరాజు, వీరన్న, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హత్యచేసిన వారిని శిక్షించాలి

కర్నూలు(అర్బన్/సిటీ): ఆలూరు మండలం ఆరికెర గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ కురువ బండారు ఈరన్నను చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని వివిధ కుల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జాతీయ సంగోళి రాయన్న సేన కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు బత్తిన కిరణ్‌కుమార్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, జిల్లా గొర్రెల సహకార సంఘం చైర్మన్ శ్రీనివాసులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈరన్న కుటుంబానికి శాశ్వతంగా ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం, ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల పరిహారం అందించాలన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు కురువ మహేంద్ర, తిరుమలేష్, రాంకుమార్, శివయ్య, బండారు శ్రీనివాసులు, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులంటే ఎంతో గౌరవం

కర్నూలు కల్చరల్: కమ్యూనిస్టులంటే తనకు ఎంతో గౌరవం ఉందని, వారిపై తాను దుర్భాషలాడినట్లు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధంగా ఉన్నానని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాక్షేత్రంలో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. తాను కళా రంగానికి తప్పా రాజకీయ రంగానికి సంబంధించిన వ్యక్తిని కాదని, రాజకీయ రంగం గురించి ఎప్పుడూ చర్చించనన్నారు. టీజీవీ కళాక్షేత్రం ప్రస్తుతం రాష్ట్రంలోనే పేరు పొందిన కళాక్షేత్రంగా సుందరంగా తీర్చిదిద్దామన్నారు. దీనిపై సంపాదించి బతకాల్సిన అవసరం తనకు లేదన్నారు. ఎలాంటి విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నానన్నారు. సమావేశంలో కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు రాజారత్నం, శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ట్రాక్టర్ల ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ చట్టాల ఉపసంహరణ హామీలను అమలు చేయాలని కోరుతూ శనివారం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీఎస్ రాధాకృష్ణ, ఎండీ అంజిబాబు, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మోదీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతోనే ట్రాక్టర్ల ర్యాలీకి పిలుపు ఇచ్చినట్లు చెప్పారు. కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ట్రాక్టర్లతో పాటు బైక్‌లు, ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ర్యాలీలో పార్టీలకు అతీతంగా రైతులు, రైతు కూలీలు, రైతు సంఘాల నాయకులు పాల్గొనాలని కోరారు.

పెళ్లి ఇష్టం లేక యువకుడి ఆత్మహత్య

కర్నూలు న్యూసిటీ: పెళ్లి ఇష్టం లేదని రాజస్థాన్‌కు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలో శనివారం చోటుచేసుకుంది. 4వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గీతా నగర్‌లో నివాసం ఉంటున్న మహేంద్ర(23) అనే యువకుడు సస్య హోండా షోరూమ్‌కు ఎదురుగా ఉండే ఎస్‌కే కాంప్లెక్స్‌లోని మహాశక్తి స్పేర్ పార్ట్స్ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు ఆరా తీయగా దుకాణంలోనే యువకుడు ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. ఘటనపై 4వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.